క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో కెనాల్ ఫీడర్ పరిధిలో ఆర్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావి శెట్టివారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



దొండపాడులో కృత్రిమ అవయవాలు పంపిణీ చేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అందించే దివ్యాంగులకు కృతిమ అవయవాలు, ఫిజియో థెరఫీ, అడియోలజి, స్పీచ్ థెరఫీ తదితర సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా ఇప్పటివరకు 570 మందికి పైగా కృత్రిమ అవయవాలను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీ ప్రసాద్‌రావు, సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవిలత పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపకుడు లెనిన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): విశ్వ మానవాళి విముక్తి కోసం పోరాడి రష్యాలో మొట్టమొదటి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని స్థాపించి మానవ సమాజానికి కొత్త మార్గాన్ని చూపించిన మహనీయుడు వీఐ లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఏలూరు ఉద్దరాజు రామం భవనంలో మంగళవారం లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకుల పూలమాలలు వేసి జోహార్లర్పించారు. అనంతరం పెట్టుబడి – ప్రజాస్వామ్యం అంశంపై సెమినార్ పి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నాటి సోవియట్ యూనియన్‌లో ఉన్న జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ మార్గాన్ని చేపట్టిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ఆయన 54 సంవత్సరాల జీవితకాలంలో ఎక్కువ భాగం జైల్లో, అజ్ఞాతంలో గడిపారని గుర్తుచేశారు. రష్యాలో మార్క్సిజం సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారిగా ఆచరణలో పెట్టిన మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు లెనిన్ అని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నేడు ప్రజలకు ప్రజాస్వామ్య హక్కులు లేవన్నారు. పీడిత ప్రజల విముక్తికి సోషలిజమే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రామాంజనేయులు, వైఎస్ కనకారావు, ఎం ఇస్సాక్, కె.విజయలక్ష్మి, జె.గోపి, కె.లెనిన్, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలపై శీతకన్ను

- రూ.కోట్లలో కార్పొరేషన్‌కు ఆదాయం
- అభివృద్ధి కాని రోడ్లు, డ్రెయినేజీలు
- తాగునీటికి ఇబ్బందులు



అధ్వానంగా శనివారపుపేట ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ



మాదేపల్లి రోడ్డు ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీ దుస్థితి



కొత్తూరు కాలనీ ప్రజలకు తాగునీరు అందిస్తున్న బోరు



వెంకటాపురం 18 డివిజన్‌లో అభివృద్ధి కాని ఏటిగట్టు రోడ్డు

ఏలూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధిపై ఏలూరు కార్పొరేషన్ పాలకవర్గం శీతకన్ను వేసింది. ఇంటి పన్నులు భారీగా పెంచిన కార్పొరేషన్ మౌలిక వసతుల కల్పన ఊసే ఎత్తడంలేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కనీసం భవిష్యత్తు ప్రణాళిక రూపొందించలేదు. సురక్షిత తాగునీరు అందక, డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై కార్పొరేటర్లు ప్రశ్నించిన దాఖలాలు లేదని వాపోతున్నారు.

సమస్యలతో సతమతం

ఏలూరు మండలం వెంకటాపురం, తంగెళ్లమూడి, సత్రంపాడు, పోణంగి, శనివారపుపేట, కొమడవోలు, చొదిమెళ్ల గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమై రెండు సంవత్సరాలు దాటింది. ఇప్పటి వరకు కార్పొరేషన్ పాలకవర్గం విలీన గ్రామాల్లో ఎలాంటి కొత్త అభివృద్ధి పనులు చేపట్టలేదు. నేటికీ శనివారపుపేట, వెంకటాపురం, పోణంగి, కొమడవోలు ప్రాంతాల్లో ప్రజలకు బోర్ల నుంచి సుద్ధనీరే సరఫరా అవుతుంది. ఇక్కడ ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న సురక్షిత తాగునీరు ప్రాజెక్టు సైతం అమలుకాలేదు. పేదల అధిక సంఖ్యలో నివసించే కొత్తూరు కాలనీ, మాదేపల్లిరోడ్డు కాలనీ, కొమడవోలు ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం పరిధిలోని వైఎస్సార్ కాలనీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ ప్రాంతాల్లో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధే కనిపిస్తుంది. తంగెళ్లమూడి బీడీ కాలనీ, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. పోణంగి, కొమడవోలు ప్రధాన రోడ్డు విస్తరించాలన్న ప్రజల కోరిక నెరవేరడం లేదు.

భారీగా పన్నుల ఆదాయం

ఏడు గ్రామాల విలీనంతో ఏలూరు నగర కార్పొరేషన్ ఆదాయం భారీగా పెరిగింది. పంచాయతీ పాలనలో ప్రజలు ఏటా రూ.12 కోట్లు ఇంటి పన్నుల రూపంలో చెల్లించారు. కార్పొరేషన్ విలీనం కాగానే ఈ మొత్తం రెట్టింపు అయ్యింది. సుమారు 22 వేల ఇళ్లు, భవనాలకు సంబంధించి యజమానుల నుంచి అధికారులు ఏటా సుమారు రూ.21 కోట్లు రాబడుతున్నారు. ఏడాదికి 5 నుంచి 10 శాతం ఇంటి పన్ను పెంచడం వల్ల ప్రజలు భారీగా పన్నులు చెల్లించాల్సి వస్తుంది. పంచాయతీలో ఏడాదికి ఒకసారి పన్ను చెల్లిస్తే, ఇప్పుడు ఏడాదికి రెండు విడతల్లో పన్ను చెల్లించాలి. ఆరు నెలలు దాటితే పన్నుపై పెనాల్టీ పడుతుంది. దీనికి తోడు విలీన గ్రామాల పరిధిలో పెద్ద ఎత్తున సాగుతున్న భూముల క్రయవిక్రయాలు, కొత్త భవనాల నిర్మాణ అనుమతులు నుంచి ఏటా సుమారు రూ.25 కోట్లు రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ కార్పొరేషన్ ఖజానాకు చేరుతుంది. మరోపక్క గ్రామాలకు చెందిన సుమారు రూ.300 కోట్లు విలువైన భూములు, చెరువులు, భవనాలు, కామన్‌సైట్లు, పంచాయతీ వాహనాలు కార్పొరేషన్ ఆదీనమయ్యాయి.

నూతి నీరే దిక్కు



మేము కొత్తూరు జూట్‌మిల్లు ఏటిగట్టు పక్కన నివసిస్తున్నాం. మాకు మంచి నీరు దొరకడం లేదు. ఎంతోకాలంగా అధికారులను వేడుకుంటున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. గతంలో పంచాయతీ అధికారులు ఒక పైప్ వేశారు. దాని నుంచి నీరు రావడం లేదు. గత్యంతరం లేక నేటికీ నూతినీరే వాడుకుంటున్నాం. కొన్నిసార్లు ఆ నీరు మరగబెట్టి తాగుతున్నాం.

– గాయత్రి, కొత్తూరు రోడ్డు

తాగునీరు అందించాలి



పోణంగి వద్ద 94.40 సెంట్లు ప్రభుత్వం చెరువు ఉంది. గత ప్రభుత్వం ఇక్కడ వాటర్ రెగ్యులేటర్ సిస్టమ్ ఏర్పాటుచేసి, విలీన గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని ప్రణాళిక వేసింది. ఈ పనులు ప్రారంభమైతే ప్రజలకు సురక్షిత తాగునీరు అందించవచ్చు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు స్థానిక ఎమ్మెల్యే చంటి ప్రయత్నిస్తున్నారు.

– కంచర్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, పోణంగి

స్వామి కుటుంబాన్ని పరామర్శించిన జయప్రకాష్



భూపతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పోణంగి ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు దుంపల స్వామి తల్లి భూపతమ్మ ఇటీవల మృతి చెందటంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పరామర్శించారు. భూపతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు కిలాడి దుర్గారావు, పార్టీ నాయకులు పిట్టా ధనుంజయ్, ఎచ్చెర్ల ఉమా మహేశ్వరరావు, బండ్లమూడి సునీల్‌కుమార్, సొంగ మధు, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉన్నతికి చదువు ఎంత అవసరమో, రహదారి భద్రత నియమాలపై అవగాహన అంతకుమించి అవసరమని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అజ్మీరా బద్దు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు, ఏలూరు అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న అటవీశాఖ అధికారి సోమరాజు



కొల్లేరు సమస్యలపై ప్రశ్నిస్తున్న లంకగ్రామాల నాయకులు

ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్ : అభివృద్ధి పనులు వేగంగా నిర్వహించాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఏలూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన రూ.కోట్లు విలువైన డ్రెయినేజీ, రోడ్ల అభివృద్ధి పనులు మరోసారి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తొలుత ప్రత్తికోళ్లలంక నాయకుడు మువ్వల అశోక్ మాట్లాడుతూ అటవీశాఖలో కొత్త అధికారులు వచ్చిన ప్రతిసారీ అక్రమ చెరువులు కొట్టేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఏన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న చెరువులను సైతం అక్రమ చెరువులుగా పరిగణిస్తున్నారని వాపోయారు. దీనిపై అటవీశాఖ డీఆర్వో సోమరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ సూచనలతో అభయారణ్యంలో తవ్విన అక్రమ చెరువులు మాత్రమే కొట్టేస్తామని చెప్పారు. తహసీల్దార్ అంతర్వేది శ్రీనివాస్ మాట్లాడుతూ భూముల రీసర్వే గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలోని జగనన్న కాలనీల్లో 350 ఖాళీ ఇళ్ల స్థలాలను గుర్తించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులకు మంజూరు చేస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్‌ఏఈ, వ్యవసాయ శాఖ, పీహెచ్‌సీ వైద్యులు తమ శాఖల పనితీరుపై మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీలత పరివేక్షణలో నిర్వహించిన ఈ సమావేశంలో సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయండి

మంత్రికి జగనన్న కాలనీ వాసుల మొర



పోణంగిలో లేఅవుట్ వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థ సారథి

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన ఇళ్ల బిల్లులు విడుదల చేయాలని జగనన్నకాలనీ లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొల్లు పార్థసారథిని కోరారు. మంగళవారం పోణంగి, కొమడవోలు వద్ద జగనన్న కాలనీ పరిశీలనకు వచ్చిన మంత్రిని పలువురు లబ్ధిదారులు కలిసి తమ సమస్యను ఏకరువు పెట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన ఇంటి రుణం విడుదల కాలేదని తెలిపారు. దీంతో అప్పు చేసి ఇళ్లు కట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వివరించారు. గత ప్రభుత్వం ఉచితంగా ఐరన్, సిమెంట్, ఇసుక ఇచ్చిందని గుర్తుచేశారు. నేడు బహిరంగ మార్కెట్లో రేట్లు పెరిగిపోవడం వల్ల నిర్మాణం వ్యయం అధికమౌతుందని తెలిపారు. జగనన్నకాలనీలో రోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధి పనులను పట్టించుకోకపోతే, కష్టపడి కట్టుకున్న ఇళ్లల్లో ఉండలేమని కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నిర్మాణం జరుగుతున్న ఇళ్లకు నిధులు ఇస్తామని చెప్పారు.

వైఎస్సార్ సీపీతోనే మేలు



శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు సంతోషంగా జీవించారని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అధ్యక్షుడిగా నియమితులైన గుడిదేశిని ఏలూరు నగరంలోని పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు గంటా మోహన్ రావు, దేవరకొండ నాగేశ్వరరావు, నెత్తిన కోటి, 39వ డివిజన్ నాయకులు కోట శంకర్, పెరుమర్తి శ్యామ్, కొవ్వాడ దుర్గారావు, 15వ డివిజన్‌కు చెందిన సొంగా మధు, చాటపర్రు గ్రామానికి చెందిన చందక దుర్గాప్రసాద్, భాను, ఉమా, ఇతర నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు టౌన్: దుకాణ సముదాయాలు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ వర్తకులకు సూచించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఆయన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బందితో ఏలూరు బులియన్ మర్చంట్ కల్యాణ మండపంలో వాణిజ్య వర్తక సంఘాల వారితో సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. బంగారు వర్తక సంఘాల ప్రతినిధులు బంగారాన్ని కొన్నా లేదా తాకట్టు పెట్టినా సదరు బంగారం యజమాని సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. దుకాణాలకు ఎదురుగా ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందిచాలని కోరారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే వెంటనే 1930కి సమాచారం అందిస్తే బాధితులకు సహాయం అందిస్తామని తెలిపారు. సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే సెల్ నెంబర్ 95503 51100కు తెలియజేస్తే దర్యాప్తు చేపడతామన్నారు. నేర నియంత్రణకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు పైడేటి రామారావు, నేరెళ్ల రాజేంద్ర, అధ్యక్షుడు తమ్మన మధుసూదన్ రావు, సెక్రెటరీలు నంగులూరు సత్యనారాయణ, కొనకళ్ల దామోదర్, మద్దాల మురళి, జాయింట్ సెక్రెటరీ వన్నెంరెడ్డి మహేష్, భాస్కర మణికంఠ, ట్రెజరర్ కనిగొళ్ల మల్లికార్జున రావు, వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలను విడుదల చేయాలి

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఐదు నెలల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ 18 నెలల పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐలను ఈ నెల 23వ తేదీ లోపు విడుదల చేయకపోతే 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. ఈ నెల 12వ తేదీన సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, ఏలూరు డీసీహెచ్‌ఎస్‌లకు తెలియజేశామని అన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వ వర్గాల నుంచి గాని, కాంట్రాక్టర్ నుంచి గాని ఎటువంటి స్పందన లేకపోవడం వలన నిరవధిక సమ్మెలోకి వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పారిశుద్ధ్య విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, వెంకట్రావు, సునీత, రామకృష్ణ, వి.వాణి, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం వాయిదా

ఏలూరు(మెట్రో): ఈ నెల 29న ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏలూరు జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వాయిదా పడింది. ఈ మేరకు కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ పేర్కొన్నారు.

కుష్టుపై సర్వే ప్రారంభం

దెందులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి కుష్టు వ్యాధి సర్వే ప్రారంభమైందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. మంగళవారం దోసపాడులో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు నిర్ధారణ సర్వేను ఆయన పరిశీలించారు. యజమానులు, ఇళ్లలోని వ్యక్తులు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. స్పర్శలేని రంగు మారిన మచ్చలు ఇతర లక్షణాలను సిబ్బంది వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలో చోరీ కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. నగరంలోని చేపలతూము సెంటర్‌కు చెందిన గేదెల శ్రీనివాసరావు స్థానికంగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ భార్య, పిల్లలతో జీవిస్తున్నాడు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈనెల 14న శ్రీనివాసరావు తన కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. పండుగ అనంతరం ఈనెల 16న ఇంటికి చేరుకుని చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.1లక్ష నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. టూటౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు. నగరంలోని పాములదిబ్బ ప్రాంతానికి చెందిన మింగి దుర్గాప్రసాద్ అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దుర్గాప్రసాద్ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకుని మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా పోలీస్ సహాయాన్ని కోరే అవకాశం ఉందని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కాలుష్యంతో మానవాళికి ముప్పు



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): విపరీతంగా పెరిగిపోయిన కాలుష్యం వల్ల మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో పర్యావరణ పరిరక్షణ చట్టంపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అధికారులు పొల్యూషన్ అరికట్టడంలో తీసుకునే చర్యలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కర్మాగారాల నుండి వెలువడే కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే విడుదల చేయాలని సూచించారు. పొడి, తడి వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా తయారు చేయటం, ప్లాస్టిక్ కవర్ల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ఆసుపత్రి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతులో నిర్మూలించాలని సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎప్పటికప్పుడు చెత్త సేకరించి నిర్మూలిస్తున్నట్టు చెప్పారు.